సాక్షి యాదాద్రి భువనగిరి

శనివారం । 4 । ఫిబ్రవరి । 2023



కొత్త పంచాయతీలకు భవనాలు
నూతన గ్రామ పంచాయతీలకు సొంత భవనాల కోసం రాష్ట్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది.
- 9లో



శివ, విష్ణు ఆరాధనతో సంపదలు
శివ, విష్ణు ఆరాధన జరిగిన కుటుంబంలో సిరిసంపదలు కలుగుతాయని స్వరూపానందేంద్ర సరస్వతీస్వామి అన్నారు.
- 10లో

వాతావరణం
గరిష్టం/కనిష్టం 32°/15°
ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. రాత్రిపూట చలి ఎక్కువగా ఉంటుంది.

న్యూస్‌రీల్

ఆలయాన్ని సందర్శించిన డిప్యూటీ కమిషనర్

బీబీనగర్ : మండలంలోని వెంకిర్యాలలో పునర్నిర్మాణం చేస్తున్న దేవాదాయ శాఖ పరిధిలోని శ్రీలక్ష్మీనారాయణ ఆలయాన్ని శనివారం రాష్ట్ర దేవాదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ రామకృష్ణారావు సందర్శించారు. ఆలయ విమాన గోపురం, రాజగోపురం పనుల గురించి నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. అంతకు ముందు స్వామివారి దర్శించుకొని పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ రాచమల్లు శ్రీనివాస్, ధర్మకర్తలు అశోక్ కుమార్ గుప్తా, యాదగిరి, సోము రమేష్ తదితరులు పాల్గొన్నారు.

యాదాద్రిలో అక్షరధామం విద్యార్థులు



ఆలయాన్ని పరిశీలిస్తున్న ఆధ్యాత్మిక బోధకులు, విద్యార్థులు

యాదగిరిగుట్ట : యాదాద్రి ఆలయాన్ని శుక్రవారం గుజరాత్‌లోని అక్షరధామం స్వామి నారాయణ ఆలయానికి చెందిన నీలకంఠ పరిషత్ ఆధ్యాత్మిక బోధకులు, విద్యార్థులు సందర్శించారు. గర్భాలయంలో స్వయంభూలను దర్శించుకొని పూజలు చేశారు. అనంతరం ఆలయ పరిసరాల్లో కలియదిరిగారు. క్షేత్ర పునర్నిర్మాణ విశేషాలను దేవస్థానం అధికారులను అడిగి తెలుసుకున్నారు. యాదాద్రి ఆలయాన్ని చూడటానికే ఇక్కడికి వచ్చినట్లు ఆధ్యాత్మిక బోధకులు, విద్యార్థులు తెలిపారు.

వరిలో చీడ, పీడలపై అప్రమత్తంగా ఉండాలి



పాచిల్లలో వరి చేనును పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారులు

గుండాల : వరిలో చీడ, పీడల పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని శాస్త్రవేత్త మధుకర్ సూచించారు. శుక్రవారం గుండాల మండలంలోని పాచిల్ల, రామారం, వెల్మజాల గ్రామాల్లో వరి క్షేత్రాలను పరిశీలించారు. మొగి పురుగు (కాండం తొలుచు పురుగు)కు తోడు చలి తీవ్రత అధికం కావడంతో పైరు ఎర్రబారి చనిపోతున్నాయని చెప్పారు. క్లోరోఫైడ్ పాస్ లేదా కాట్రాఫ్ హైడ్రోక్లోరైడ్ లీటర్ నీటిలో 2 గ్రాములు కలిపి పిచికారీ చేయాలని సూచించారు. కాండం కుళ్లి వేర్లు నల్లబారి చనిపోతే ట్రొఫికోనా జోన్ పిచికారీ చేయాలన్నారు. వీటితో పాటు 13045 ఫార్ములాను 4, 7 రోజులకు పిచికారీ చేయాలని పేర్కొన్నారు. యూరియాలో డీజిల్ కలిపి చల్లడం, పిచికారీ చేయొద్దన్నారు. ఈ కార్యక్రమంలో ఏఓ లావణ్య, పాచిల్ల ఉప సర్పంచ్ భాస్కర్, యాదగిరి, రామారం గ్రామ కోఆర్డినేటర్ చెన్నారెడ్డి, ప్రభాకర్, సంగి రాజు, ఏఈఓలు ఆకాంక్ష, శ్రీశైలం, క్రాంతికుమార్, భార్గవి, శ్వేత పాల్గొన్నారు.

రాచకొండలో భూ సరిహద్దుల పరిశీలన



మ్యాప్ ద్వారా సరిహద్దులను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి

సంస్థాన్ నారాయణపురం : మండలంలోని రాచకొండ ప్రాంతంలో రెవెన్యూ, అటవీ శాఖ భూముల సరిహద్దులను అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా భూములకు సంబంధించిన మ్యాప్‌ను ఆయన పరిశీలించారు. సర్వే నంబర్లు, భూముల రకాలపై ఆరా తీశారు. ఆయన వెంట చౌటుప్పల్ ఆర్డీఓ ఉపేందర్‌రెడ్డి, తహసీల్దార్ శ్రీనివాస్‌రాజు ఉన్నారు.

అథ్లెటిక్స్‌లో పతకాలు

భువనగిరి : హైదరాబాద్‌లోని గచ్చిబౌలి స్టేడియంలో జరుగుతున 5వ నేషనల్ మాస్టర్ గేమ్స్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీల్లో భువనగిరికి చెందిన అంబోజు అనిల్‌కుమార్, గోనూరు శ్రీనివాస్ సిల్వర్ మెడల్స్ సాధించారు. 800 మీటర్ల పరుగు పందెంలో అనిల్‌కుమార్, షాట్‌పుట్ విభాగంలో శ్రీనివాస్ పతకాలు సాధించినట్లు జిల్లా యువజన క్రీడల అభివృద్ధి అధికారి ధనుంజయ్య శుక్రవారం తెలిపారు. విద్యార్థులను పలువురు అభినందించారు.

● కమనీయం.. నృసింహుడి కల్యాణం



యాదాద్రి పాతగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం రాత్రి స్వామి, అమ్మవారి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు



కల్యాణాన్ని వీక్షిస్తున్న భక్తులు

● యాదాద్రీశుడి సేవలో గవర్నర్



రాష్ట్ర గవర్నర్ తమిళి సై సౌందరరాజన్ శుక్రవారం యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి దర్శించుకున్నారు. గర్భాలయంలో స్వయంభూలకు పూజలు నిర్వహించారు.

కలల సౌధం | కొందరికే సొంతం!

అర్హులందరికీ అందని డబుల్ బెడ్‌రూం ఇళ్లు

- వేలల్లో దరఖాస్తుదారులు.. గ్రామాల్లో పదుల సంఖ్యలో గృహాలు
- పూర్తిస్థాయిలో న్యాయం చేయలేని పరిస్థితి
- ఇళ్లు వచ్చిన వారిలో ఆనందం, రాని వారిలో నిరాశ

సాక్షి, యాదాద్రి : డబుల్ బెడ్ రూం ఇళ్ల పథకం కొందరిలో ఆనందం నింపగా.. మరికొందరికి నిరాశను మిగిల్చింది. ఇళ్లు తక్కువ.. దరఖాస్తుదారులు వేలల్లో ఉండడంతో అందరికీ న్యాయం చేయలేని పరిస్థితి నెలకొంది. దీంతో ఇళ్లు రానివారు ఆందోళనకు దిగుతున్నారు. అనర్హులు, బీఆర్‌ఎస్ కార్యకర్తలకే ఇళ్లు ఇచ్చారంటూ అధికార పార్టీ ప్రజాప్రతినిధులను నిలదీస్తున్నారు. ఆలేరు మండలం కొలనుపాకలో ప్రభుత్వ విప్ గొంగిడి సునీత కాన్వాయ్ అడ్డగించారు. పెట్రోల్ డబ్బాలతో చేర్యాల రహదారిపై ఆందోళన చేపట్టి కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. అదే విధంగా యాదగిరిగుట్ట మండలం మాసాయిపేట, ఆత్మకూరు(ఎం) మండలం ఉప్పలపహాడ్‌లోనూ ధర్నాలు చేశారు. ఉప్పలపహాడ్‌లో నీళ్ల ట్యాంకు ఎక్కి నిరసన తెలిపారు. శుక్రవారం ఆలేరు పట్టణంలో దరఖాస్తులుదారులు రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు.

మాసాయిపేటలో..
యాదగిరిగుట్ట మండలం మాసాయిపేటలో 40, వంగపల్లిలో 40, మొత్తం 80 డబుల్ బెడ్ రూం ఇళ్లను ప్రభుత్వం నిర్మించింది. వీటి కోసం మాసాయిపేటలో 111 మంది దరఖాస్తు చేసుకున్నారు. వీటిలో 40 మంది పేర్లను అధికారులు ఖరారు చేసి ఇళ్ల పట్టాలను పంపిణీ చేశారు.

వంగపల్లిలో.. 105 మంది దరఖాస్తు చేసుకోగా 38 మందిని ఎంపిక చేశారు. రెండు ఇళ్లను హోల్డ్‌లో పెట్టినట్లు తెలిసింది. వీరికి పట్టాలు ఇవ్వలేదు.

ఉప్పలపహాడ్‌లో వసతులు లేకున్నా పంపిణీ
ఆత్మకూర్ మండలంలోని ఉప్పలపహాడ్‌లో 45 డబుల్ బెడ్ రూంలను ప్రభుత్వం నిర్మించింది. 110 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఇటీవల గ్రామసభ నిర్వహించి లబ్ధిదారులను ఎంపిక చేశారు. వీటిని ప్రభుత్వ విప్ గొంగిడి సునీత ఇటీవల ప్రారంభించి లబ్ధిదారులకు పట్టాలు అందజేశారు. కానీ, మంచినీరు, విద్యుత్ వసతి, ఇళ్లకు కిటికీలు సక్రమంగా లేవు. దీంతో గృహ ప్రవేశం చేసిన మరుసటి రోజే ఇళ్లకు తాళాలు వేశారు.

ఆలేరులో 64 మంది ఎంపిక
ఆలేరు మండలం కొలనుపాకలో 64 ఇళ్లు నిర్మించారు. ఇందుకోసం 153 మంది దరఖాస్తు చేసుకున్నారు. సర్వే చేసిన అధికారులు 67 మందిని అర్హులుగా గుర్తించి వారిలో 64 మందిని ఎంపిక చేశారు. ఇటీవల వీరికి ఇళ్ల పట్టాలు అందజేశారు.



ఉప్పలపహాడ్‌కు చెందిన కళ్లెం నాగలక్ష్మి భర్త ఐదేళ్ల క్రితం మృతిచెందాడు. నాగలక్ష్మి కూలి పనులు చేసుకుంటూ గ్రామంలోనే ఉంటుంది. కుమారుడు హైదరాబాద్‌లో ఉంటాడు. ఇల్లు లేకపోవడంతో డబుల్ బెడ్ రూం ఇంటికోసం దరఖాస్తు చేసుకుంది. స్థానికంగా ఉన్న ఓ మాజీ ప్రజాప్రతినిధికి రూ.30వేలు కూడా ఇచ్చింది. మొదటి జాబితాలో ఈమె పేరు ఉన్నప్పటికీ తుది జాబితాలో లేదు.



ఆలేరు మండలం కొలనుపాకకు చెందిన బోయిని ఎల్లమ్మ భర్త అనారోగ్యంతో మృతి చెందాడు. ఎల్లమ్మ కూలి పనులు చేసుకుంటూ అద్దె ఇంట్లో ఉంటోంది. డబుల్ బెడ్ రూం ఇంటికి దరఖాస్తు చేసుకోగా మొదటి జాబితాలో పేరు వచ్చింది. చివరి జాబితాలో చోటు దక్కలేదు. తనకు ఎలాంటి ఆధారం లేదని, ఇల్లు మంజూరు చేయాలని కోరుతుంది.



ఆత్మకూర్(ఎం) మండలం పల్లెపహాడ్‌లో డబుల్ బెడ్ రూం ఇళ్లు

అర్హతలున్నా రాలేదు



మాకు డబుల్ బెడ్‌రూం ఇంటి కోసం అన్ని అర్హతలున్నా రాలేదు. వ్యవసాయ భూమి కూడా లేదు. నిరుపేద కుటుంబం. అద్దె ఇంట్లో నివసిస్తున్నాం. డబుల్ బెడ్ రూం వస్తుందని ఎంతో ఆశగా ఎదురు చూశాం. కానీ న్యాయం జరగలేదు.
– కొండోజు నాగమణి, మాసాయిపేట

సంతోషంగా ఉంది



మాకు గ్రామంలో ఇల్లు లేదు. ప్రభుత్వం నిర్మించిన డబుల్ బెడ్ రూం ఇల్లు మంజూరైంది. ఇంటికి దరఖాస్తు చేసుకోగా.. అన్ని విధాలా పరిశీలించి మాకు ఒక్క రూపాయి ఖర్చు లేకుండా ఇల్లు అందజేశారు. మాకు చాలా సంతోషంగా ఉంది.
– ఆకుల సుజాత, ఉప్పలపహాడ్

ఆలేరులో రాస్తారోకో

ఆలేరు రూరల్ : అర్హులకు డబుల్ బెడ్ రూం ఇళ్లు ఇవ్వాలని కోరుతూ దరఖాస్తుదారులు శుక్రవారం ఆలేరులోని రైల్వేగేట్ వద్ద రాస్తారోకో చేశారు. కౌన్సిలర్ సమంత మాట్లాడుతూ నిరుపేదలను కాదని అధికార పార్టీకి చెందిన వారికి ఎంపిక చేస్తున్నారని ఆరోపించారు. నిజమైన అర్హులకు అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆలేరులో డుబుల్ బెడ్‌రూం ఇళ్ల లబ్ధిదారుల ఎంపికలో అవకతవకలు జరుగుతున్నాయన్నారు. పోలీసులు వచ్చి నచ్చజెప్పడంతో రాస్తారోకో విరమింపజేశారు. ఈ కార్యక్రమంలో లక్ష్మి, జంద్యాల లక్ష్మి, సర్వర్, అహ్మద్, సోమ లక్ష్మి, సరిత, మంజుల తదితరులు పాల్గొన్నారు.



రాస్తారోకో చేస్తున్న దరఖాస్తుదారులు

మెట్లబావికి త్వరలోనే పూర్వ వైభవం

- అదనపు కలెక్టర్ దీపక్ తివారీ

భువనగిరి : మున్సిపాలిటీ పరిధిలోని 8వార్డులో మసీదు వద్ద ఉన్న పురాతన మెట్లబావికి త్వరలో పూర్వ వైభవం తీసుకురానున్నట్లు అదనపు కలెక్టర్ దీపక్ తివారీ తెలిపారు. శుక్రవారం ఆయన మెట్లబావిని సందర్శించారు. బావిలోని నీటిని, పరిసరాలను పరిశీలించారు. బావిని శుభ్రం చేసి నీటిని వాడుకలోకి తేవాలని మున్సిపల్ కమిషనర్ నాగిరెడ్డికి సూచించారు. మెట్లబావిని ఆధునీకరిస్తే స్థానికులతో పాటు యాదాద్రికి వచ్చే భక్తులు సైతం సందర్శించే అవకాశం ఉంటుందన్నారు. పేర్కొన్నారు. అనంతరం సమీకృత మార్కెట్‌ను సందర్శించారు. ప్రహరీ, సీసీ రోడ్డు నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. అలాగే మున్సిపల్ డంపింగ్ యార్డుకు వెళ్లి బయో మైనింగ్ ఏర్పాట్లను పరిశీలించారు. వారంలోపు పనులు ప్రారంభించాలని ఆదేశించారు.



మెట్లబావిని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ దీపక్ తివారీ, మున్సిపల్ కమిషనర్ నాగిరెడ్డి

విద్యార్థుల అభ్యున్నతికి చేయూతనివ్వండి

- కలెక్టర్ పమేలా సత్పతి

భువనగిరి : జీ నారాయణమ్మ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ పుల్లారెడ్డి గ్రూప్ నిర్వాహకులు యాదాద్రి భువనగిరి జిల్లాలో విద్యార్థుల భవిష్యత్‌కు దోహదపడే వర్క్ షాపులు, వివిధ అంశాలపై కౌన్సిలింగ్ కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. శుక్రవారం జీఎన్ఐటీ పుల్లారెడ్డి గ్రూప్ ప్రతినిధులు కలెక్టరేట్‌లో కలెక్టర్‌ను కలిసి జిల్లాలో విద్యార్థుల కోసం నిర్వహించనున్న కార్యక్రమాల గురించి వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వారికి పలు సూచనలు చేశారు. జిల్లాలోని 20 భవిత కేంద్రాల్లో క్యాంపులు ఏర్పాటు చేసి విద్య, ప్రేరణ, ధైర్యం కల్పించడంతో పాటు సామాజిక అంశాలపై అవగాహన కల్పించాలని కోరారు. ఇందుకోసం సదస్సులు, వర్క్‌షాపులు విస్తృతంగా నిర్వహించి తెలియజేయాలన్నారు. స్వచ్ఛంద సంస్థలు కూడా ముందుకొచ్చి విద్యార్థుల అభ్యున్నతికి చేయూతనివ్వాలని కోరారు. ప్రభుత్వ ఆధ్వర్యంలో చేపట్టే కార్యక్రమాలతో పాటు జిల్లాలోనూ ఇప్పటికే నిర్వహిస్తున్న పలు కార్యక్రమాలు సత్ఫలితాలిస్తున్నాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ దీపక్ తివారీ, డీఈఓ కె.నారాయణరెడ్డి, జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డాక్టర్ మల్లికార్జున్‌రావు, డీఐఈఓ రమణి, సెక్టోరియల్ అధికారి ఎన్.అండాలు, జీఎన్ఐటీ పుల్లారెడ్డి గ్రూప్ వైస్ చైర్‌పర్సన్ విద్యారెడ్డి, డాక్టర్ సీత, కళ్యాణి, నరసింహ, రాజన్న పాల్గొన్నారు.

సన్ సిటీ వెంచర్‌లో పేలుళ్లు



వివరాలు వెల్లడిస్తున్న డీసీపీ రాజేశ్‌చంద్ర, పక్కన ఏసీపీ నర్సింహారెడ్డి, సీఐ నవీన్‌రెడ్డి, ఆలేరు ఎస్ఐ వెంకటశ్రీను, చిత్రంలో పోలీసులు స్వాధీనం చేసుకున్న జిలెటిన్ స్టిక్స్, డిటోనేటర్లు, కనెక్టింగ్ వైర్

- దాడులు నిర్వహించిన పోలీసులు
- పేలుడు పదార్థాలు స్వాధీనం
- ఆరుగురిపై కేసు నమోదు

సాక్షి, యాదాద్రి : ఆలేరు మండలంలోని కందిగడ్డ శివారులో హైదరాబాద్ –వరంగల్ జాతీయ రహదారిపై గల జీఎస్ఆర్ సన్ సిటీ వెంచర్‌లో అనుమతి లేకుండా బ్లాస్టింగ్‌లు చేపడుతుండడంతో ఎస్ఓటీ పోలీసులు గురువారం రాత్రి దాడులు నిర్వహించారు. పేలుళ్లకు పాల్పడుతున్న ఆరుగురిలో నలుగురిని అరెస్ట్ చేయగా మరో ఇద్దరు పరారీలో ఉన్నారు. వారి నుంచి జిలెటిన్ స్టిక్స్, డిటోనేటర్లు, కనెక్టింగ్ వైర్, కంప్రెషర్ వాహనంతో పాటు నాలుగు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. వెంచర్ యజమానిపై కూడా కేసు నమోదు చేశారు.ఇందుకు సంబంధించిన వివరాలను డీసీపీ రాజేశ్‌చంద్ర శుక్రవారం భువనగిరిలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వెల్లడించారు. జీఎస్ఆర్ సన్ సిటీ వెంచర్‌లో భూమిని చదును చేసే బాధ్యతలను వెంచర్ యజమాని తాడేపల్లి నారాయణ తన వద్ద పనిచేస్తున్న యెన్న మల్లారెడ్డి, సల్లగురుగుల శ్రీనివాస్ అలియాస్ రాజుకు అప్పగించాడు. అయితే వెంచర్‌లో ఉన్న బండరాళ్లను పగులగొట్టడం శ్రమతో కూడుకున్న పని అని, బ్లాస్టింగ్ చేద్దామని యజమానిని ఒప్పించారు. మహేందర్ అనే వ్యక్తి వద్ద పేలుడు సామగ్రి కొనుగోలు చేశారు. అనంతరం ట్రాక్టర్, కంప్రెషర్ ఆపరేటర్లు ఆలకుంట్ల కమలాకర్, ఆలకుంట్ల సుమలాకర్‌తో కలిసి గురువారం వెంచర్‌లోకి పేలుడు పదార్థాలు తరలించారు. ఎలాంటి అనుమతి లేనప్పటికీ మల్లారెడ్డి, సల్లగురుగుల శ్రీనివాస్ బ్లాస్టింగ్ పనులు చేపట్టారు. విశ్వసనీయ సమాచారం మేరకు ఆలేరు పోలీసులు వెంచర్‌లో దాడులు నిర్వహించి నలుగురిని అరెస్టు చేశారు. వారి నుంచి 57 జిలెటిన్ స్టిక్స్, 51 డిటోనేటర్లు, మూడు కనెక్టింగ్ వైర్ బిండల్స్, కంప్రెషర్ వాహనంతో పాటు నాలుగు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు.

నలుగురి రిమాండ్
బ్లాస్టింగ్ ఘటనలో ఆరుగురిపై కేసు నమోదు చేయగా వెచర్ యజమానితో పాటు మరో వ్యక్తి మహేందర్ పరారీలో ఉన్నాడు. పట్టుబడ్డ నిందితులను కోర్టులో రిమాండ్ చేసినట్లు డీసీపీ తెలిపారు. అన్ని కోణాల్లో కేసు దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. పేలుడు పదార్థాలు సరఫరా చేసిన వ్యక్తులను కూడా పట్టుకుంటామన్నారు. అనుమతులు లేకుండా పేలుడు పదార్థాలు నిల్వ చేయడం, సరఫరా చేయడం నేరమన్నారు. ఎంతటి వారైనా చట్టపరమైన చర్యలు తప్పవన్నారు.

పెద్దగట్టుకు పండుగ శోభ

రేపటి నుంచి లింగమంతుల స్వామి జాతర



దురాజ్‌పల్లి గుట్టపై లింగమంతుల స్వామి ఆలయం



శ్రీచౌడమ్మతల్లి, యలమంచమ్మ, గంగమ్మ తల్లి విగ్రహాలు

- ముమ్మరంగా సాగుతున్న ఏర్పాట్లు
- సుమారు 50 లక్షల మంది భక్తులు వచ్చే అవకాశం

చివ్వెంల : పెద్దగట్టు జాతర శోభను సంతరించుకుంది. ప్రతి రెండేళ్లకోసారి జరిగే ఈ పెద్దగట్టు లింగమంతుల స్వామి జాతర రాష్ట్రంలోనే రెండో అతిపెద్ద పండుగ. ఈ జాతరకు దాదాపు 260 ఏళ్ల చరిత్ర ఉంది. లింగమంతులస్వామి దర్శనానికి రాష్ట్రంలోని 33జిల్లాలతో పాటు ఇతర సరిహద్దు రాష్ట్రాల నుంచి కూడా భక్తులు వచ్చి మొక్కులు చెల్లించుకుంటారు. జనవరి 22న యాదవులు సంప్రదాయం ప్రకారం జాతరకు దిష్టిపూజ నిర్వహించగా.. ఈనెల 5వ తేదీ నుంచి జాతర మొదలుకానుంది. ఈ జాతరకు ప్రభుత్వం పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రస్తుతం ఈ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. జాతరలో ఆయా శాఖలకు కేటాయించిన పనులు పూర్తి చేయడంలో అధికారులు నిమగ్నమయ్యారు. కాగా శుక్రవారం జిల్లా కలెక్టర్ వెంకట్రావ్, ఎస్పీ రాజేంద్రప్రసాద్, అదనపు కలెక్టర్ పాటిల్ హేమంత్ కేశవ్ పెద్దగట్టును సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు.

మొదలైన కోలాహలం
జాతరకు రెండు రోజుల ముందే పెద్దగట్టు వద్ద సందడి మొదలైంది. జాతరకు సుమారు 50 లక్షల మంది భక్తులు వచ్చే అవకాశముంది. జాతరలో జాయింట్ వీల్ (రంగుల రాట్నం), బ్రేక్ డ్యాన్స్, సర్కస్, హంస వాహనం, తదితర ఎగ్జిబిషన్ పరికరాలు, తదితర దుకాణాలు సిద్ధం చేసే పనిలో సంబంధిత వర్గాలు నిమగ్నమయ్యాయి.

పరిశీలించిన కలెక్టర్, ఎస్పీ
జాతర నేపథ్యంలో జరుగుతున్న పనులను శుక్రవారం జిల్లా కలెక్టర్ ఎస్.వెంకట్రావ్, ఎస్పీ రాజేంద్రప్రసాద్, అదనపు కలెక్టర్ పాటిల్ హేమంత్ కేశవ్‌లతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా సంబంధిత అధికారులతో సమావేశం ఏర్పాటు చేసి పలు సూచనలు చేశారు. దేవాలయ ప్రాంగణాన్ని విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించాలని, విద్యుత్‌కు ఎలాంటి అంతరాయం కలగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ట్రాఫిక్, శానిటేషన్, తాగునీటి వసతి, పార్కింగ్ సమస్యలు లేకుండా చూడాలన్నారు. మంత్రులు, ప్రజాప్రతినిధులకు ప్రోటోకాల్ విషయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ కోడి సైదులుయాదవ్, ఆర్డీఓ రాజేంద్రకుమార్, డీఎస్పీలు పాల్గొన్నారు.

భక్తులకు ఇబ్బంది కలగకుండా ఏర్పాట్లు
గుట్ట పరిసర ప్రాంతాలతో పాటు గుట్టపై భక్తుల సౌకర్యార్థం అధికారులు తగిన ఏర్పాట్లను చేస్తున్నారు. ఇప్పటికే చలువ పందిళ్ల ఏర్పాట్లు, ప్రధాన దేవాలయాన్ని సుందరంగా తీర్చిదిద్దారు. ఇక గుట్టపై వైద్యారోగ్య, పోలీస్, మీడియా, రెవెన్యూ, దేవాలయ శాఖలకు ప్రత్యేక స్టాళ్లను ఏర్పాటు చేశారు. భక్తులకు ఇబ్బంది లేకుండా క్షౌ రశాలను సిద్ధం చేశారు. గుట్టపై జంతుబలితో రక్తం పారి దుర్వాసన వస్తుండడంతో నివారించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఈ ప్రాంతంలో ప్లాట్‌ఫారమ్ నిర్మించి ఒకేమార్గం గుండా రక్తం కిందికి వెళ్లేలా పైప్‌లైన్ నిర్మించారు. గుట్ట కిందిభాగంలో చెరువుకట్టపై బారికేడ్లు, గుట్టపై, కింది భాగంలో హైమాస్ట్ లైట్లను ఏర్పాటు చేశారు. గుట్టకు ఉత్తరభాగంలో ఉన్న కొనేరును శుభ్రం చేసి నీటితో నింపారు. అలాగే జాతీయ రహదారిపై ఉన్న సింహద్వారాలను సుందరంగా ముస్తాబు చేశారు.

క్లుప్తంగా

వైభవంగా తిరువీధి సేవోత్సవం



ఆలయంలో అమ్మవారికి సేవోత్సవాన్ని నిర్వహిస్తున్న ఆచార్యులు

యాదగిరిగుట్ట : ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ఆలయంలో శుక్రవారం సాయంత్రం ఆండాల్ అమ్మవారి తిరువీధి సేవోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. అమ్మవారికి ఇష్టమైన రోజు కావడంతో సాయంత్రం ప్రత్యేకంగా అలంకరించి, ఆలయ మాఢ, తిరువీధిలో ఆండాల్ అమ్మవారిని విశేషంగా అలంకరించి, సేవోత్సవం చేపట్టారు. అనంతరం మండపంలో అమ్మవారికి ఊంజలి సేవోత్సవాన్ని జరిపించారు. మహిళలు మంగళ హారతులు, భాజభజంత్రీలతో సేవోత్సవం ఘనంగా జరిగింది.

వ్యక్తి అదృశ్యం



అదృశ్యమైన లింగయ్య

ఆత్మకూర్-ఎస్ : ఇంటి నుంచి పనికోసం వెళ్లి ఓ వ్యక్తి అదృశ్యమయ్యాడు. ఈ ఘటన మండల పరిధిలోని తుమ్మలపెన్ పహాడ్‌లో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన నల్లగొండ లింగయ్య 18రోజుల క్రితం సూర్యాపేట పట్టణానికి పని కోసం వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. దీంతో అప్పటి నుంచి కుటుంబ సభ్యులు వెతకగా ఆచూకీ లభించకపోవడంతో శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో తండ్రి నల్లగొండ వెంకన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై యాదవేందర్ రెడ్డి తెలిపారు.

ద్విచక్రవాహనం అదుపుతప్పి వ్యక్తి మృతి

చౌటుప్పల్ : ద్విచక్రవాహనం అదుపు తప్పి రోడ్డు పక్కన ఉన్న చెట్టును ఢీకొని ఓవ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన మండల పరిధిలోని ఆరెగూడెం గ్రామంలో గురువారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్‌ఐ సైదులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆరెగూడెం గ్రామానికి చెందిన గంగనబోయిన ఐలయ్య(40) వృత్తి రీత్యా లారీడ్రైవర్. గురువారం ఐలయ్య ఇంటి నుంచి ద్విచక్రవాహనంపై పంతంగి గ్రామం వైపు వెళ్తున్నాడు. ఈ క్రమంలో తన ద్విచక్రవాహనం అదుపు తప్పి రోడ్డు పక్కన ఉన్న చెట్టును ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో ఐలయ్య శరీర లోపలి భాగంలో తీవ్రగాయాలు కావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి అన్న గంగనబోయిన శ్రీశైలం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో భర్త మృతి, భార్యకు తీవ్రగాయాలు



ఎస్‌కే నబీసాబ్

హుజూర్‌నగర్ (చింతలపాలెం) : టిప్పర్, టీవీఎస్‌లు ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో టీవీఎస్‌పై ప్రయాణిస్తున్న భార్యభర్తల్లో భర్త మృతి చెందగా భార్యకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన చింతలపాలెం గ్రామశివారులో శుక్రవారం చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చింతలపాలెం గ్రామానికి చెందిన ఎస్‌కే నబీసాబ్(65) అతడి భార్య సైదాబీ పొలం పనికి వెళ్లి తిరిగి ఇంటికి వెళ్తున్నారు. ఈ క్రమంలో చింతలపాలెం నుంచి మేళ్లచెరువు వైపు వెళ్తున్న టిప్పర్ వారు ప్రయాణిస్తున్న ద్విచక్రవాహనం ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ఘటనలో నబీసాబ్ రోడ్డుపై పడి అక్కడికక్కడే మృతి చెందగా అతడి భార్య సైదాబీకి తీవ్రగాయాలయ్యాయి. దీంతో గమనించిన స్థానికులు హుజూర్‌నగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి అటునుంచి మెరుగైన చికిత్సకు ఖమ్మం ఆస్పత్రికి తరలించారు. వారి కుమారుడు ఎస్‌కే సత్తార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ కృష్ణారెడ్డి తెలిపారు.

లింగమంతుల జాతర ఇలా..

- ఈనెల 5నుంచి ఐదురోజుల పాటు జరుగనున్న జాతర



శ్రీ లింగమంతుల స్వామి ఆలయం

చివ్వెంల : ఈనెల 5నుంచి ప్రారంభంకానున్న పెద్దగట్టు శ్రీలింగమంతులస్వామి జాతర 5రోజుల పాటు సాగనుంది. ఒక్కోరోజు ఒక్కో విశిష్టతతో జరగనున్న జాతర మొదటగా గంపల ప్రదక్షిణతో ప్రారంభమై.. ఐదోరోజు స్వామివారి ప్రత్యేక దర్శనంతో ముగుస్తుంది.

→ మొదటిరోజు గంపల ప్రదక్షిణ..

జాతరలో మొదటిది అత్యంత కీలకమైన ఘట్టం గంపల ప్రదక్షిణ. దిష్టిపూజ జరిగిన 15రోజుల తర్వాత (ఆదివారం) జాతర ప్రారంభం అవుతుంది. ఆదివారం కేసారం గ్రామం నుంచి చౌడమ్మ తల్లి ఉన్న దేవరపెట్టెను తీసుకొని యాదవ, రెడ్డి కులస్తులు కాలినడకన బయలుదేరి దురాజ్‌పల్లిలో ఉన్న గొల్లగట్టు (పెద్దగట్టు)కు చేరుకుంటారు. ఈ సందర్భంగా గజ్జల లాగులు ధరించి భేరి చప్పుల్లు, కత్తుల విన్యాసాలు చేస్తూ ఓ లింగా.. ఓలింగా.. నామస్మరణంతో గంపలతో ఆలయం చుట్టూ భక్తులు ప్రదక్షిణలు చేస్తారు. మెంతబోయిన, రెడ్డి, గొర్ల, మున్నవారి సమక్షంలో రెండు బోనాలు చేసి పూజలు నిర్వహిస్తారు. దీంతో మొదటి రోజు ఘట్టం ముగుస్తుంది.

→ రెండో రోజు సౌడమ్మకు బోనాలు..

జాతరలో రెండో రోజు (6వ తేదీ, సోమవారం) చౌడమ్మ తల్లికి బోనాలు సమర్పిస్తారు. ఇందులో భాగంగా మున్న వంశీయులు తెచ్చిన బద్దెపాల గొర్రె, రెడ్డి వంశీయులు తెచ్చిన వర్ద గొర్రె,, మెంతబోయిన వారు తల్లి గొర్రెలను ముందుగా అమ్మవారి ముందు ఆయుధాలతో జల్త పడుతారు. అనంతరం మున్న వంశీయులు ఉపవాసం ఉండి నిష్ఠతో తెచ్చిన బద్దెపాల గొర్రెను అమ్మవారికి బలి ఇస్తారు. అనంతరం గొర్రె ఆయాలు సాయాలు (పేగులు, లివర్ కిడ్నీలు, నల్లెడ, గుండె, మాంసం) నెయ్యిలో వేసి వంట చేస్తారు. మున్న వంశీయులు యజమానులుగా, మెంతబోయిన వారు జాగిలాలుగా వ్యవహరిస్తూ, మెంతబోయిన వారి మెడలో కండువాలు ఉంచి మున్నవారు పట్టుకోగా బండపై పోసిన అన్నాన్ని మెంతబోయిన వారు నోటితో నాకుతారు (తింటారు).



నీటితో నింపిన కోనేరు

→ మూడో రోజు చంద్రపట్నం..

మూడో రోజు (7న, మంగళవారం) స్వామివారి కల్యాణోత్సవంలో భాగంగా చంద్రపట్నం వేస్తారు. మెంతబోయిన వారు తీసుకొచ్చిన పూజాసామగ్రి, తెల్లపిండి, పచ్చపిండి, పసుపు, కుంకుమలతో చంద్రపట్నం వేస్తారు. చెక్కపై పసుపు, కుంకుమలు వేసి అందంగా పట్నం వేస్తారు. అనంతరం యాదవ వంశీయులు స్వామివారి కల్యాణం జరిపిస్తారు. దీంతో చంద్రపట్నం , స్వామివారి కల్యాణం తంతు ముగుస్తుంది.

→ నాలుగోరోజు నెలవారం..

జాతరలో నాలుగో రోజు బుధవారం (8న) జరిగే కార్యక్రమం నెలవారం. కేసారం నుంచి పాలు తీసుకొచ్చి రెండు కొత్త బోనం కుండల్లో పాలు పొంగిస్తారు. అనంతరం మున్నావారి గొర్రెను బలిఇస్తారు. ఈ సందర్భంగా బైకాన్లు, బక్కులు కథలు చెప్పడం ద్వారా తంతు పూర్తి చేస్తారు.

→ ప్రత్యేక దర్శనంతో ఐదో రోజు ముగింపు..

జాతరలో ఐదోరోజైన గురువారం (9న) స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తుల దర్శనార్థం ఉంచుతారు. జాతర తంతు పూర్తయిన తర్వాత మొత్తం భక్తులు తుదిసారిగా మొక్కులు చెల్లించి ఇంటి ముఖం పడతారు. దీంతో జాతర ముసిగినట్లు ప్రకటిస్తారు.

జాతరకు బస్సులను సద్వినియోగం చేసుకోవాలి

భానుపురి (సూర్యాపేట) : దురాజ్‌పల్లి పెద్దగట్టు జాతర సందర్భంగా సూర్యాపేట ఆర్టీసీ డిపో నుంచి ఏర్పాటు చేసే ప్రత్యేక బస్సులను ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని సూర్యాపేట డీఎం సురేందర్ అన్నారు. శుక్రవారం స్థానిక డిపోలో పెద్దగట్టు జాతరకు మొదటి బస్సును డప్పువాయిద్యాల నడుమ ప్రారంభించారు. ఈ సందర్భంగా పట్టణ వీధుల్లో ఊరేగింపు నిర్వహించి పెద్దగట్టు వద్దకు చేరుకున్నారు. కార్యక్రమంలో యాకాంబరం, ఎన్‌సీ సైదులు, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



జాతర స్పెషల్ బస్సును ప్రారంభిస్తున్న డీఎం



గుట్టపై ఉన్న కోనేరుకు వేసిన రంగులు



కోనేరు పక్కన ఏర్పాటు చేసిన గదులు



జాతరలో ఏర్పాటు చేసిన జాయింట్ వీల్స్



మెట్ల వద్ద ఏర్పాటు చేసిన ఆహ్వాన ఫ్లెక్సీ



జాతరలో ఏర్పాటు చేసిన బస్ పార్కింగ్

మట్టపల్లి క్షేత్రంలో వైభవంగా నిత్యకల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

మఠంపల్లి : మట్టపల్లి దేవాలయంలో శ్రీరాజ్యలక్ష్మి చెంచులక్ష్మి సమేత శ్రీలక్ష్మీనరసింహస్వామి నిత్యకల్యాణాన్ని శుక్రవారం అర్చకులు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో సుప్రభాతసేవ, ప్రత్యేకార్చనలు జరిపించారు. అనంతరం స్వామి అమ్మవార్లకు అష్టోత్తర సహస్ర నామార్చన, కుంకుమార్చన చేపట్టారు. అదే విధంగా నూతన పట్టు వస్త్రాలంకరణతో స్వామి అమ్మవార్లను వధూవరులుగా అలంకరించి ఎదుర్కోళ్ల మహోత్సవం నిర్వహించారు. అనంతరం విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనం, రక్షాబంధనం, రుత్విగ్వరనం, మధుపర్కపూజ, మాంగల్యధారణ గావించారు. నీరాజన మంత్రపుష్పాలతో మహానివేదన గావించి భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ అనువంశిక ఛైర్మన్ చెన్నూరు విజయ్ కుమార్, ఈఓ నవీన్, అర్చకులు లక్ష్మణాచార్యులు పద్మనాభాచార్యులు, బదరీనారాయణాచార్యులు, లక్ష్మీనరసింహమూర్తి, ఫణిభూషణ మంగాచార్యులు, ఆంజనేయాచార్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

ప్రేమించినవాడు దక్కడంలేదని..

యువతి బలవన్మరణం



కాకళ్ల మౌనిక (ఫైల్)

రాజాపేట : ప్రేమించినవాడు దక్కడంలేదని మనస్థాపానికి గురైన ఓ యువతి బావిలోదూకి బలవన్మరణానికి పాల్పడింది. ఈ ఘటన మండలంలోని పాముకుంట గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కాకల్ల చంద్రమ్మకు ఇద్దరు కుమారులు, కుమార్తెలు ఉన్నారు. కాగా చిన్నకుమార్తె మౌనిక(20) తండ్రి చనిపోవడంతో తల్లితో కలిసి వ్యవసాయ పనులు చేస్తుండేది. మౌనిక అదే గ్రామానికి చెందిన ఓ యువకుడిని ప్రేమించింది. అతడికి కొద్దిరోజుల క్రితం పెళ్లి సంబంధం కుదిరింది. దీంతో ప్రేమించిన వ్యక్తి తనకు దక్కడంలేదని మనస్థాపానికి గురైన మౌనిక గురువారం ఇంటి నుంచి వెళ్లిపోయింది. కుటుంబ సభ్యులు ఆమె కోసం వెతకగా ఆచూకీ లభించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాగా శుక్రవారం మధ్యాహ్నం గ్రామం శివారులోని ఓ వ్యవసాయ బావి వద్ద మౌనిక చెప్పులు లభించడంతో బావిలో వెతకగా శవమై తేలింది. దీంతో కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు.

బాలికను వేధించిన వ్యక్తికి జైలు



మారోజు సతీష్

గుండాల : ఓ మైనర్ బాలికను ప్రేమపేరుతో వేధించిన వ్యక్తికి 3సంవత్సరాల జైలు శిక్షతో పాటు రూ.3వేల జరిమానా విధిస్తూ భువనగిరి జడ్జి కె.మారుతీదేవి శుక్రవారం తీర్పు వెలువరించారు. పోలీ సుల తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని బ్రాహ్మణపల్లి గ్రామానికి చెందిన మైనర్ బాలిక జనగామ జిల్లా కేంద్రంలోని ట్రిబుల్ ఆర్ డిగ్రీ కళాశాలలో డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతుంది. దీంతో అదే గ్రామానికి చెందిన మారాజు సతీష్ అలియాస్ సత్యనారాయణచారి ఆ బాలికను ప్రేమపేరుతో రోజూ వేధించసాగాడు. ఆ బాలిక వేధింపులు తట్టుకోలేక విషయాన్ని తల్లిదండ్రులకు చెప్పింది. వారు సతీష్ తల్లి దండ్రులకు చెప్పినప్పటికీ మార్పురాకపోగా, ఓ రోజు బాలిక కళాశాలకు వెళ్తుండగా అడ్డుకొని ప్రేమించాలని, లేకపోతే చంపుతానని తనకు రోజూ ఫోన్ చేయాలని బెది రించాడు. దీంతో బాలిక వెంటనే తన తండ్రికి విషయాన్ని చెప్పడంతో 27-09-2017న స్థానిక పోలీస్‌స్టేషన్‌లో బాలిక తండ్రి ఫిర్యాదు చేశాడు. అప్పటి ఎస్‌ఐ నిందితుడిపై పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. ఈ కేసు శుక్రవారం కోర్టులో తీర్పుకురాగా నిందితుడికి 3సంవత్సరాల జైలు శిక్షతో పాటు రూ.3వేల జరిమానా విధిస్తూ జడ్జి తీర్పు వెలువరించారు.

స్వాతంత్య్ర సమరయోధుడు జనార్దన్‌రెడ్డి మృతి



చింతలపురి జనార్దన్‌రెడ్డి (ఫైల్)

రాజాపేట : మండలంలోని రేణికుంట గ్రామానికి చెందిన స్వాతంత్య్ర సమరయోధుడు, తెలంగాణ సాయుధ పోరాట యోధుడు చింతలపురి జనార్దన్‌రెడ్డి (98) శుక్రవారం మృతి చెందాడు. జనార్దన్‌రెడ్డి తెలంగాణ సాయుధ పోరాటంలో చురుకుగా పనిచేశారు. జనార్దన్ రెడ్డి కొన్ని రోజుల క్రితం అనారోగ్యానికి గురికావడంతో హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఉదయం మృతి చెందాడు. ఆయనకు ఓ కుమారుడు, నలుగురు కుమార్తెలు ఉన్నారు.

కనులపండువగా శ్రీపూర్వగిరీశుడి కల్యాణం

- పాతగుట్టలో కొనసాగుతున్న వార్షిక బ్రహ్మోత్సవాలు
- అర్ధరాత్రి వైభవంగా లక్ష్మీనరసింహుల పరిణయం
- నేడు దివ్యవిమాన రథోత్సవం



కల్యాణోత్సవానికి హాజరైన భక్తులు

యాదగిరిగుట్ట : శ్రీపూర్వగిరి లక్ష్మీనరసింహస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా శ్రీనృసింహస్వామి కల్యాణాన్ని శుక్రవారం రాత్రి అర్చకులు కనులపండువగా నిర్వహించారు. ఈ వేడుకలో గజవాహనంపై శ్రీనృసింహస్వామి, ప్రత్యేక పల్లకిపై శ్రీలక్ష్మీ అమ్మవార్లకు పట్టు వస్త్రాలు, బంగారు ఆభరణాలు, వజ్ర వైఢ్యూరాలతో ముస్తాబు చేసి తిరువీధుల్లో ఊరేగిస్తూ కల్యాణ మండపానికి తీసువచ్చి కల్యాణ తంతును నిర్వహించారు. ఆయా వేడుకల్లో ఇన్‌చార్జ్ ఈఓ రామకృష్ణరావు, అనువంశిక ధర్మకర్త బి.నర్సింహమూర్తి, ఆలయాధికారులు, ప్రధానాచార్యులు, ఉప ప్రధానార్చకులు, ఆచార్యులు పాల్గొన్నారు.

తిరువీధుల్లో ఊరేగింపు..

శ్రీనృసింహుడు దేవేరి శ్రీలక్ష్మీదేవిల పరిణయ వేడుక అధ్యాంతం భక్త జనుల మధ్య అంగరంగ వైభవంగా జరిగింది. భాజా భజంత్రీలు, భక్తుల జయజయ నినాదాలు, పండితుల వేదమంత్రాల నడుమ శ్రీస్వామి వారు గజవాహనారుఢుడై.. సర్వాలంకార సుశోభితుడుగా, సుందర మనోహరుడుగా.. అమ్మవారు దివ్యాలంకార శోభితమై ప్రత్యేక పల్లకిసేవలో శ్రీస్వామి వారిని అనుసరించగా ఆలయ తిరువీధుల్లో ఊరేగింపు సేవ సాగింది.

నేడు రథోత్సవం..

బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం ఆలయంలో ఉదయం 8గంటలకు హవనం పూజలు నిర్వహిస్తారు. అనంతరం గరుఢ వాహనంపై శ్రీస్వామి వారిని ఊరేగిస్తారు. రాత్రి 8గంటలకు శ్రీస్వామి వారి రథోత్సవాన్ని జరిపిస్తారు.



ఆలయ ఆవరణలో నృత్యం చేస్తున్న కళాకారిణి

జిలకర్ర బెల్లం.. మాంగళ్యధారణ

ఆది దేవతల తిరుకల్యాణ మహోత్సవంలో విశేషంగా జరిగింది. ఆచార్యులు శ్రీ స్వామికి జంధ్యధారణ చేసి సకల దేవలత ఆశీస్సులతో.. వేద మంత్ర పఠనంతో శ్రీవారు అమ్మవారికి, అమ్మవారు శ్రీవారికి జీలకర్ర బెల్లం పెట్టిన తంతు కనులపండువగా జరిగింది. అనంతరం వేద మంత్రాలు, మంగళ వాయిద్యాలు, సన్నాయి మేళాల నడుమ శ్రీనృసింహుడు శ్రీమహాలక్ష్మీ అమ్మవారి మెడలో మాంగళ్య ధారణ గావించారు.



పట్టువస్త్రాలు సమర్పిస్తున్న ఆర్డీఓ భూపాల్‌రెడ్డి



హనుమంత వాహనసేవను ఊరేగిస్తున్న ఆచార్యులు, అధికారులు

ఉదయం హనుమంత వాహనంపై..

బ్రహ్మోత్సవంలో భాగంగా ఉదయం 8గంటలకు పారాయణీకులచే నిత్య ప్రబంధ పారాయణములు, యాజ్ఞీకులచే నిత్య హవనములు, మూల, మూర్తిమంత్ర అనుష్టానములు, హవనం పూజలు జరిగాయి. అనంతరం శ్రీస్వామి వారికి, అమ్మవారికి వేదమంత్ర మధ్య 'తిరుమంజన మహోత్సవ 'వేడుక నిర్వహించారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు..

బ్రహ్మోత్సవాల్లో భాగంగా సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి. యాదగిరిగుట్టకు చెందిన శ్రీభాగ్యలక్ష్మీ భజన మండలి, వీర పత్రాప భజన మండలిచే భజన, జీవీఆర్ మ్యూజిక్ ఇన్‌స్టిట్యూట్ వాచిచే భక్తి సంగీతం, మిర్యాల నిఖిల బృందంచే నృత్య ప్రదర్శన నిర్వహించారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి

వలిగొండ : మండలంలోని గోకారంలో గురువారం రాత్రి ఓ రైతు విద్యుదాఘాతంతో మృతి చెందాడు. పోలీసులు, బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన వెంకటగళ్ల ముత్యాలు (65) తన పొలం వద్ద విద్యుత్ మోటారు పని చేయకపోవడంతో మరమ్మతులు చేయడానికి గురువారం సాయంత్రం వెళ్లాడు. కాగా మోటార్ వద్దకు వెళ్లే దారి నిండా గడ్డి మొలవడంతో కొడవలితో కోస్తున్నాడు. ఈ క్రమంలో అక్కడున్న కరెంట్ వైరు ప్రమాదవశాత్తు తగిలి షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. రాత్రి సమయం 10 దాటినా ముత్యాలు ఇంటికి రాకపోవడంతో కుటుంబసభ్యులు పొలం వద్దకు వెళ్లి వెతకగా మృతి చెంది ఉన్నాడు. మృతుడి కుమారుడు బాబు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ ప్రభాకర్ తెలిపారు.

ఇసుక అక్రమ రవాణా నిలిపివేయాలి

నార్కట్‌పల్లి : మూసీ వాగు నుంచి ట్రాక్టర్ల ద్వారా అక్రమంగా ఇసుక రవాణాను నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ అమ్మనబోలు గ్రామస్తులు, రైతులు శుక్రవారం ఎండ్ల బండ్లతో నార్కట్‌పల్లి - మోత్కూర్ రహదారిపై రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మూసీ నుంచి ఉదయం, రాత్రి వేళలో ఇసుక అక్రమ రవాణా సాగుతోందని.. దానివల్ల గ్రామంలో భూగర్భ జలాలు తగ్గిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.

పేకాట స్థావరంపై దాడి

యాదగిరిగుట్ట రూరల్ : పేకాట స్థావరంపై ఎస్‌ఓటీ పోలీసులు దాడి చేసి తొమ్మిది మందిని అరెస్ట్ చేశారు. యాదగిరిగుట్ట పట్టణ సీఐ సైదయ్య తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని తాళ్లగూడెం గ్రామశివారులో కొంత మంది పేకాట ఆడుతున్నట్లు పక్కా సమాచారం తెలియడంతో ఎస్‌ఓటీ పోలీసులతో కలిసి గురువారం రాత్రి దాడులు నిర్వహించామన్నారు. ఈ దాడుల్లో తొమ్మిది మందిని అదుపులోకి తీసుకుని, వారి నుంచి రూ.65,430నగదు, రెండు కార్లు, 4బైకులు, 10సెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ మేరకు వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.



శుక్రవారం అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలకు హాజరవుతున్న ఎమ్మెల్యేలు సైదిరెడ్డి, చిరుమర్తి లింగయ్య, బొల్లం మల్లయ్య, పైళ్ల శేఖర్ రెడ్డి, భాస్కర్‌రావు, కంచర్ల భూపాల్‌రెడ్డి, కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్సీ ఎలిమినేటి కృష్ణారెడ్డి